# రెండు నిబంధనలు

## ఓవెన్ డి. ఆల్‌బ్రిచ్

> ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడియున్నది; అంతకంటే శ్రేష్ఠమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్టబడెను. దీనిద్వారా దేవుని యొద్దకు మనము చేరుచున్నాము (హెబ్రీ. 7:18, 19).

వాటి రెండింటిని పోల్చడానికి స్పష్టమైన ఉదాహరణను ఉపయోగించి, పౌలు పాత నిబంధన, క్రొత్త నిబంధనలను గూర్చి యిలా వ్రాశాడు:

> ధర్మశాస్త్రమునకు లోబడియుండ గోరువారలారా, మీరు ధర్మశాస్త్రము వినుట లేదా? నాతో చెప్పుడి. దాసివలన ఒకడును, స్వతంత్రురాలివలన ఒకడును ఇద్దరు కుమారులు అబ్రాహామునకు కలిగిరని వ్రాయబడియున్నది గదా? అయినను దాసివలన పుట్టినవాడు శరీర ప్రకారము పుట్టెను, స్వతంత్రురాలివలన పుట్టినవాడు వాగ్దానమును బట్టి పుట్టెను. ఈ సంగతులు అలంకార రూపకముగా చెప్పబడియున్నవి. ఈ స్త్రీలు రెండు నిబంధనలైయున్నారు; వాటిలో ఒకటి సీనాయి కొండ సంబంధమైనదై దాస్యములో ఉండుటకు పిల్లలు కనును; ఇది హాగరు. ఈ హాగరు అనునది అరేబియా దేశములో ఉన్న సీనాయి కొండయే. ప్రస్తుతమందున్న యెరూషలేము దాని పిల్లలతోకూడా దాస్యమందున్నది గనుక ఆ నిబంధన దానికి దీటయియున్నది. అయితే పైనున్న యెరూషలేము స్వతంత్రముగా ఉన్నది; అది మనకు తల్లి (గలతీ. 4:21–26).

వాస్తవంగా, హాగరుచే ప్రాతినిధ్యం చేయబడిన నిబంధన పాత నిబంధన. క్రైస్తవులు స్వతంత్రురాలు, శారా, క్రొత్త నిబంధన పిల్లలైయున్నారు. అయితే దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనకు సూచనగా ఉన్న దాసి కుమారులు కారు (గలతీ. 4:31). దాసి కుమారులు స్వతంత్రురాలి కుమారులతో వారసులు కానేరరు (గలతీ. 4:30). కుమారులే గాని, దాసులు వారసులుకారు (గలతీ. 4:7).

మొదటి నిబంధన ఇశ్రాయేలీయులతో చేయబడింది (నిర్గమ. 34:27, 28). క్రొత్త నిబంధన క్రింద వారసులు దేవుని కుమారులు, క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినవారు (గలతీ. 3:26, 27). మొదటి నిబంధన క్రింద ఉన్నవారు, స్వతంత్రురాలి పిల్లలతో వారసులు కానేరరు. అంటే, క్రీస్తునందలి దేవుని నిబంధన క్రింద ఉన్నవారితో వారసులు కారు. మొదటి నిబంధన యొక్క దాస్యంనుండి విడిపింపబడినవారైనందున, దాస్యమను కాడి క్రింద మరల చిక్కుకొనకూడదు. క్రీస్తు ప్రభువు మనలను స్వతంత్రులుగా చేశాడు (గలతీ. 5:1).

అపొస్తలులు క్రొత్త నిబంధనకు పరిచారకులైయున్నారు (2 కొరింథీ. 3:6). రాళ్లమీద చెక్కబడిన పది ఆజ్ఞలకంటే అది ఎంతో మహిమగలదైయుంది. మొదటి నిబంధన

మరణకారణమైనదియు శిక్షావిధికి సంబంధించినదియునైన పరిచర్యయైయుంది (2 కొరింథీ. 3:7–9). దేవుని మహిమాయుక్తమైన ప్రసన్నతలో ఆ నిబంధనను పొందిన తరువాత, తన ముఖ ప్రకాశాన్ని ఇశ్రాయేలీయులు చూడలేక పోయినందున మోషే ముసుకు వేసికొనవలసి వచ్చింది (2 కొరింథీ. 3:7–13; నిర్గమ. 34:27–33).

కొరింథులోనున్న క్రైస్తవులకు పౌలు వ్రాసే సమయానికి, రాళ్లమీద చెక్కబడిన నిబంధన క్రొత్త నిబంధనకున్నంత మహిమ లేనిదై (2 కొరింథీ. 3:9, 10), నిలిచియుండ లేక పోయింది. "తగ్గిపోవునదే మహిమగలదై యుండినయెడల, నిలుచునది మరి యెక్కువ మహిమగలదైయుండును గదా" (2 కొరింథీ. 3:11). తాను పరిచారకుడైయున్న క్రొత్త నిబంధన యింకను నిలిచేయుంది. రాళ్లమీద చెక్కబడినది తగ్గిపోయింది.

దేవుడు ఇశ్రాయేలీయులకు ప్రసాదించిన ధర్మశాస్త్రము దాని పనిని నెరవేర్చి, క్రీస్తు యేసునందు చేయబడిన క్రొత్త నిబంధన యొక్క రాకతో అంతరించింది. క్రీస్తు యొక్క సిలువ రక్తముచేత యిప్పుడు క్రొత్త నిబంధన ప్రతిష్ఠింపబడినందున, దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధన క్రింద యిక ఉండము. తన సమస్త మహిమతో క్రీస్తునందలి దేవుని క్రొత్త నిబంధన ప్రకాశించునట్లు అవి వాటి పనిని ముగించి అంతమయ్యాయి.